వర్ధన్నపేటలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి

- సంక్షేమ పథకాలను అర్హులకు అందించాలి
- ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు
- వనమహోత్సవంలో మొక్కలు నాటిన కలెక్టర్

వర్ధన్నపేట, జూలై 5: మానవ మనుగడ, పర్యావరణ పరిరక్షణ కోసం నాటుతున్న ప్రతి మొక్కనూ సంరక్షించే బాధ్యత తీసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం మండలంలోని కొత్తపల్లి, వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కలెక్టర్ సత్య శారదాదేవితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నాటిన మొక్కలను గ్రామ పంచాయతీల సిబ్బంది, ప్రజలు, మున్సిపల్ సిబ్బంది విధిగా కాపాడాలని కోరారు. సంక్షేమ పథకాలను అర్హులకు పారదర్శకంగా అందేలా చూడాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. ఇల్లంద–కొత్తపల్లి రహదారికి ఇరువైపులా నాటుతున్న మొక్కలు చనిపోకుండా కాపాడాలని జీపీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో మనోజ్ అగర్వాల్, డీఆర్డీవో కౌసల్య, ఎంపీడీవో వెంకటరమణ, తహసీల్దార్ విజయ్‌సాగర్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ, వైస్ చైర్మన్ ఎలేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో ప్రాణ వాయువు

నల్లబెల్లి/ఖానాపురం/గీసుగొండ/చెన్నారావుపేట/పర్వతగిరి: మొక్కలు ప్రాణ వాయువును అందిస్తాయని నల్లబెల్లి ఎంపీవో కూచన ప్రకాశ్ అన్నారు. మండలంలోని రుద్రగూడెం పల్లెప్రకృతి వనంలో ఆయన మొక్కలు నాటారు. వనమహోత్సవంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి పద్మనాభం, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే, ఖానాపురంలోని పశువైద్యశాల ఆవరణలో తహసీల్దార్ కిరణ్‌కుమార్ మొక్కలు నాటారు. ఖానాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వనమహోత్సవంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి సుప్రజ, ఈజీఎస్ సిబ్బంది, జీపీ సిబ్బంది పాల్గొన్నారు. గీసుగొండ మండలం కోనాయిమాకుల గ్రామంలో తహసీల్దార్ రియాజుద్దీన్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రామాల ప్రత్యేక అధికారులు రమేశ్, శ్రీనివాస్, ప్రభాకర్, హరిప్రసాద్‌బాబు, చంద్రకాంత్, సురేశ్‌కుమార్, ఫారెస్టు సెక్షన్ అధికారి ఖలీల్, ఎస్సై జానీపాషా, కార్యదర్శులు పాల్గొన్నారు. చెన్నారావుపేట మండలంలోని కందిగడ్డ తండాలో మండల ప్రత్యేక అధికారి బాలకృష్ణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో దయాకర్, ఎంపీవో శ్రీధర్ రాజు, ఏపీవో అరుణ, ఈసీ కిశోర్ పాల్గొన్నారు. పర్వతగిరిలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఎంపీడీవో శంకర్‌నాయక్, తొర్రూరు ఆర్టీసీ డిపో మేనేజర్ పద్మావతి, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో సుశీల్‌కుమార్, పర్వతగిరి కార్యదర్శి రఘు, బస్టాండ్ కంట్రోలర్ వెంకటేశ్వర్లు, ఐకేపీ సీసీలు కాంతయ్య, రమాదేవి, ఈసీ రాజు, టీఏ గణేశ్, మాజీ ఉపసర్పంచ్ రంగు జనార్దన్‌గౌడ్, వీవో సుబ్రహ్మణ్యం, మహిళా సంఘాల సభ్యులు మొక్కలు నాటారు. గోపనపెల్లిలో మండల పశువైద్యాధికారి డాక్టర్ వరిపెల్లి నరేశ్, కార్యదర్శి సదానందం మొక్కలు నాటారు.

ఖిలావరంగల్: మిల్స్‌కాలనీ పోలీసుల అదుపులో ఉన్న బీజేపీ కార్యకర్తలు, ఖానాపురంలో అరెస్టయిన బీజేపీ నాయకులు

నిరుద్యోగుల సమస్యలపై నిరసన గళం

- ముందస్తు అరెస్టులపై ఆగ్రహం
- కలెక్టరేట్ ఎదుట బీజేవైఎం నేతల నిరసన

ఖిలావరంగల్, జూలై 5: నిరుద్యోగుల సమస్యలపై వివిధ పార్టీల నాయకులు నిరసన గళం వినిపించారు. ఇందులో భాగంగా తెలంగాణలోని నిరుద్యోగుల సమస్యలపై శుక్రవారం బీజేవైఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. గ్రూప్–1 మెయిన్స్ 1:50 కాకుండా 1:100 నిష్పత్తితో ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు గ్రూప్–2లో 783 పోస్టులను రెండు వేలకు పెంచాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బీజేవైఎం నాయకులు ప్రశాంత్, రాజేశ్, వినయ్, అరుణ్, సాయి, రతన్ కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్‌కు అందజేశారు.

బీజేపీ కార్యకర్తల ముందస్తు అరెస్టు

ఖిలావరంగల్/ఖానాపురం: నిరుద్యోగుల సమస్యలపై కలెక్టరేట్ ముట్టడి నేపథ్యంలో బీజేపీ కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మిల్స్‌కాలనీ పోలీసులు ఉదయం ఐదు గంటల నుంచే బీజేపీ ముఖ్య నాయకుల ఇండ్లకు వెళ్లి అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. అక్రమ అరెస్టులను బీజేపీ నేతలు ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టు చేసినంత మాత్రన పోరాటం ఆగదని హెచ్చరించారు. అరెస్టయిన వారిలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదాసు రాజు, పుప్పాల శ్రీనివాస్, చింతల అనిల్, మండల భూపాల్, గొర్రె కోటి, వేల్పుల నందు, ఇనుముల రాజు ఉన్నారు. అలాగే, ఖానాపురంలో ఎస్సై రఘుపతి ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున బీజేపీ, బీజేవైఎం, ఎస్ఎఫ్ఐ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆబోత్ రాజుయాదవ్, మండల ప్రధాన కార్యదర్శి బూడిద ముఖేశ్‌కుమార్, బీజేవైఎం మండల అధ్యక్షుడు ఆకుల హేమంత్, ఎఫ్ఎఫ్ఐ జిల్లా నాయకుడు యార ప్రశాంత్ ఉన్నారు.

చెన్నారావుపేట: నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

చెన్నారావుపేట: అక్రమ అరెస్టులతో నిరుద్యోగుల ఉద్యమాన్ని ఆపలేరని నిరుద్యోగుల సంఘం మండల నాయకులు హెచ్చరించారు. నిరుద్యోగులు హైదరాబాద్‌లోని టీఎస్‌పీఎస్‌సీ ముట్టడికి పిలుపునివ్వడంతో పోలీసులు మండలంలోని నిరుద్యోగ సంఘాల నాయకులను గురువారం రాత్రి ముందస్తు అరెస్టు చేశారు. కాంగ్రెస్ సర్కారు జాబ్ క్యాలెండర్, ఉద్యోగ నియామక ప్రక్రియను నేటికీ అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ యువతను మోసం చేసిందని విమర్శించారు. అరెస్టయిన వారిలో బీజేవైఎం, ఏఐఫ్‌డీఎస్ నాయకులు ఉన్నారు.

అర్ధరాత్రి అరెస్టులు దుర్మార్గం

నర్సంపేటరూరల్: అర్ధరాత్రి అరెస్టులు దుర్మార్గమని ఎంసీపీఐ(యూ) డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి అన్నారు. మాదన్నపేట గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా ఉద్యమాలు చేస్తున్న నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. నిర్బంధ పాలన కొనసాగిస్తే రానున్న రోజుల్లో ప్రజా ఉద్యమాల వెల్లువలో కాంగ్రెస్ పార్టీ కొట్టుకుపోతుందని హెచ్చరించారు. గురువారం అర్ధరాత్రి తమ పార్టీ విద్యార్థి సంఘం నాయకుడు జన్ను రమేశ్‌ను పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు గుర్రం రవి, ఆకుల రాజేందర్, కేశెట్టి సదానందం, దండు సాంబయ్య, కేశెట్టి శ్రీనివాస్, కందికొండ సాంబయ్య పాల్గొన్నారు.

'తక్షణమే మౌలిక వసతులు కల్పించాలి'

గిర్మాజీపేట, జూలై 5: సీకేఎం దవాఖానలో నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు చేపట్టి మౌలిక వసతులు కల్పించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా జిల్లా కమిటీ కార్యదర్శి నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. సీకేఎం దవాఖానలో శుక్రవారం మౌలిక వసతులపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నమాల మాట్లాడుతూ దవాఖానలో బ్లడ్‌బ్యాంక్ లేక ఎంజీఎం దవాఖానకు వెళ్లాల్సి వస్తున్నదని వాపోయారు. ఒకవేళ పేషెంట్ పరిస్థితి విషమంగా ఉంటే ఎంజీఎం నుంచి రక్తం తీసుకొచ్చేలోగా ప్రాణాలు పోయే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. దవాఖానలో ప్రసవం తర్వాత ఆడపిల్ల పుడితే రూ. 1,500, అబ్బాయి పుడితే రూ. 3 వేలను సిబ్బంది డిమాండ్ చేస్తున్నారని సర్వేలో తెలిసిందన్నారు. టాయిలెట్స్ మరీ అధ్వానంగా ఉన్నాయని వాపోయారు. అనంతరం వివిధ సమస్యలపై సూపరింటెండెంట్ నిర్మలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు బాషపాక సంగీత, దయ్యాల లక్ష్మి, కే మౌనిక, ఆర్ అపర్ణ పాల్గొన్నారు.

సీకేఎం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న రత్నమాల తదితరులు

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- నర్సింగ్ విద్యార్థులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి
- ఎంజీఎంను తనిఖీ చేసిన కలెక్టర్
- ఎమర్జెన్సీ వార్డులో ఏసీ పనిచేయకపోవడంపై ఆగ్రహం

కాశీబుగ్గ, జూలై 5: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సత్య శారదాదేవి అన్నారు. గురువారం హైదరాబాద్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ సమీక్షించిన విషయం తెలిసిందే. వారి ఆదేశాల మేరకు వరంగల్ ఎంజీఎం దవాఖాన పరిధిలోని స్కూల్ ఆఫ్ నర్సింగ్ భవనాన్ని సూపరింటెండెంట్ చంద్రశేఖర్, సంబంధిత శాఖల అధికారులతో కలిసి శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. అలాగే, కళాశాలలో నెలకొన్న సమస్యలను నర్సింగ్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భవనం శిథిలావస్థకు చేరుకున్న దృష్ట్యా వెంటనే విద్యార్థులను ఇతర భవనంలోకి మార్చాలని సూచించారు. హౌసింగ్, టీజీఎంఐడీసీ, ఆర్‌అండ్‌బీ, టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్ అధికారులు భవనాన్ని పరిశీలించి స్థితిగతులు, మరమ్మతులపై తక్షణమే నివేదిక అందించాలని ఆదేశించారు. జూనియర్ డాక్టర్లు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు కలిపి మొత్తం 500 మందికి ప్రత్యామ్నాయ వసతి కోసం అవసరమైన భవనంపై అధికారులతో చర్చించారు. వరంగల్‌లోని రాంకీలో ఉన్న కొత్త భవనాలను కలెక్టర్ పరిశీలించారు. మూడు ప్రాంతాల్లో భవనాలను పరిశీలించామని, ప్రభుత్వానికి నివేదించనున్నట్లు చెప్పారు. నర్సింగ్ కళాశాల భవనంలో మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టీజీఎంఐడీసీ అధికారులను ఆదేశించారు. అంతకుముందు దవాఖానలోని అవుట్ పేషెంట్, ఎమర్జెన్సీ వార్డులను కలెక్టర్ పరిశీలించారు. ఎమర్జెన్సీ వార్డులో ఏసీ పని చేయకపోవడం, అపరిశుభ్రంగా ఉండడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా విభాగాల వద్ద రోగులు కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, ఆర్ఎంవో శ్రీనివాస్, రోడ్లు భవనాల శాఖ అధికారి జితేందర్‌రెడ్డి, టీజీఎంఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాద్, గృహ నిర్మాణ శాఖ అధికారి వాసు ఉన్నారు.

కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న వైద్యాధికారులు

బాలికలను తల్లిదండ్రులకు అప్పగింత

ఖిలావరంగల్, జూలై 5: ఇంటి నుంచి వెళ్లిపోయిన ఇద్దరు బాలికలను పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. మిల్స్‌కాలనీ సీఐ కథనం ప్రకారం.. రంగశాయిపేటకు చెందిన ఇద్దరు బాలికలు ఈ నెల 3న మొబైళ్లు తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయారు. తిరిగి రాకపోవడంతో వారి తల్లి కాంపల్లి దివ్య 4న స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఐటీ కోర్ సహాయంతో రెండు బృందాలుగా విడిపోయి బాలికల వద్ద ఉన్న మొబైల్ నంబర్ ఆధారంగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు గుర్తించారు. అనంతరం అక్కడికి వెళ్లి వారిని పట్టుకొని మిల్స్‌కాలనీ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చి తల్లికి అప్పగించినట్లు సీఐ తెలిపారు.

అనారోగ్యంతో కారోబార్ మృతి

ఖానాపురం, జూలై 5: అనారోగ్యంతో కారోబార్ మృతి చెందిన ఘటన ధర్మారావుపేటలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన దూకుంట్ల రాములు(58) కారోబార్‌గా పని చేస్తున్నాడు. ఇతడు ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాములు మృతదేహానికి మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, బత్తిని శ్రీనివాస్‌గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు.

కడుపునొప్పి భరించలేక ఒకరి ఆత్మహత్య

ఖానాపురం, జూలై 5: కడుపునొప్పి భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన నాజీతండాలో జరిగింది. జరుపుల భద్రు(40) కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. గతంలో ఆపరేషన్ సైతం చేయించుకున్నాడు. మళ్లీ కడుపునొప్పి వస్తుండడంతో జీవితంపై విరక్తి చెందిన అతడు గురువారం ఇంట్లో క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు నర్సంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గిర్మాజీపేట, జూలై 5: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన వరంగల్ 33వ డివిజన్ శాంతినగర్‌లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఆడెపు వినయ్(28) ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. జీతం డబ్బులు సరిపోకపోవడంతో కలతచెందిన అతడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం రాత్రి పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు గమనించి వినయ్‌ని అంబులెన్స్‌లో ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మరణించారు. మృతుడి తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆగి ఉన్న స్కూటీని ఢీకొట్టిన ట్రాక్టర్

ఇద్దరికి తీవ్ర గాయాలు

నర్సంపేట రూరల్, జూలై 5: ఆగి ఉన్న స్కూటీని ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఇద్దరు పాదచారులు తీవ్రంగా గాయపడిన ఘటన నర్సంపేట పట్టణంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఝాన్సీ సైకిల్ స్టోర్ ఎదుట ఆగి ఉన్న స్కూటీని ఓ ట్రాక్టర్ డ్రైవర్ స్పీడ్‌గా వచ్చి ఢీకొట్టాడు. దీంతో స్కూటీ ధ్వంసం కావడంతోపాటు పక్కనే ఉన్న ఇసుకలో పడిపోయింది. ఈ క్రమంలో రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న హన్మకొండ రామనాథం, బుచ్చమ్మను ఢీకొట్టింది. దీంతో రామనాథం కాలు విరగడంతోపాటు బుచ్చమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. ట్రాక్టర్ డ్రైవర్ పారిపోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను పట్టణంలోని ఆస్పత్రికి తరలించారు.

విచారణ పేరుతో రెండు రోజులుగా ఠాణాలో..

సోషల్ మీడియాలో వైరల్

ఖిలావరంగల్, జూలై 5: ఐపీ పెట్టిన నలుగురు కుటుంబ సభ్యులను వరంగల్ సబ్ డివిజన్ పరిధిలోని ఓ ఠాణాలో రెండు రోజులుగా విచారణ జరుపుతున్నట్లు సమాచారం. ఐపీ పెట్టి ఊరు విడిచి వెళ్లిపోయిన కుటుంబ సభ్యులను రెండు రోజుల క్రితం పోలీసులు గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు తెలిసింది. ఓ యువతితోపాటు ఆమె తల్లిని కూడా స్టేషన్‌లో ఉంచినట్లు వినికిడి. ఇదే విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నేపథ్యంలో మిల్స్‌కాలనీ సీఐ పీ మల్లయ్యను వివరణ కోరగా.. తమ స్టేషన్‌లో అలాంటిదేమీ లేదన్నారు. కాగా, ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

స్కూల్ బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి

లక్ష్మి(ఫైల్)

కాశీబుగ్గ, జూలై 5: ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన వరంగల్‌లోని 18వ డివిజన్ క్రిస్టియన్‌కాలనీలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. క్రిస్టియన్ కాలనీకి చెందిన గబ్బెట లక్ష్మి(61) శుక్రవారం ఉదయం పాల ప్యాకెట్ తీసుకుని ఇంటికి వస్తున్న క్రమంలో ఓ ప్రైవేట్ హైస్కూల్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. లక్ష్మి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్ పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని మిల్స్‌కాలనీ పోలీసులు ఎంజీఎం దవాఖాన మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

180 కిలోల బెల్లం పట్టివేత

వర్ధన్నపేట, జూలై 5: సారా తయారీకి ఉపయోగించే 180 కిలోల బెల్లాన్ని పట్టుకున్నట్లు వర్ధన్నపేట ఎక్సైజ్ సీఐ ఎం.స్వరూప తెలిపారు. మండలకేంద్రంలోని ఓ కిరాణా షాపులో బెల్లం, ఈస్ట్ పౌడర్, చక్కెరను విక్రయిస్తున్నారనే సమాచారంతో సోదాలు చేసి 180 కిలోల నల్ల బెల్లం, 250 కిలోల చక్కెర, 4 కిలోల ఈస్ట్‌పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

సిబ్బంది గైర్హాజర్‌పై నిరంతర నిఘా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌వో వెంకటరమణ

రాయపర్తి/పర్వతగిరి, జూలై 5: జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పనితీరు, గైర్హాజర్‌పై నిరంతర నిఘా పెంచుతున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. సిబ్బంది, రోగుల పట్టికలు, హాజరు రిజిస్టర్లు, రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమాచారం లేకుండా గైర్హాజర్ అయ్యే ఉద్యోగులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రోగులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానలకు తాళాలు వేసి ఉన్నట్లు తెలిస్తే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మాధవి, పద్మ, రత్నప్రభ, రజిత, శివాని పాల్గొన్నారు. అలాగే, పర్వతగిరి పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో వెంకటరమణ తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది సమయపాలన, రికార్డులను పరిశీలించి వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పచ్చని చెట్ల నరికివేత

కరీమాబాద్‌లోని ప్రధాన రహదారిపై నరికి పడేసిన చెట్లు

కరీమాబాద్, జూలై 5: అభివృద్ధి, విద్యుత్ తీగలకు అడ్డంకి పేరుతో పచ్చనిచెట్లను నరికివేస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వం వనమహోత్సవం పేరుతో మొక్కలు నాటుతుంటే.. మరోవైపు పలువురు రోడ్లపై ఉన్న భారీ వృక్షాలను నరికివేస్తున్నారు. కరీమాబాద్‌లోని ప్రధాన రహదారి వెంట ఉన్న పలు చెట్లను నరికివేసి రోడ్డుపై పడేశారు. దీంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చెట్లను నరికివేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇల్లందలో రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న అధికారులు

రైస్ మిల్లును తనిఖీ చేసిన అధికారులు

వర్ధన్నపేట, జూలై 5: ఇల్లందలో లక్ష్మీగణపతి రైస్‌మిల్లును శుక్రవారం అధికారులు తనిఖీ చేశారు. ఇటీవల కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లుకు కేటాయించిన ధాన్యంతోపాటు నిల్వ ఉన్న ధాన్యం బస్తాలు, ఇతర వివరాలను అధికారులు పరిశీలించారు. అలాగే, గతేడాదికి సంబంధించిన నిల్వలను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలుసుకున్నారు. తనిఖీల్లో తహసీల్దార్ విజయ్‌సాగర్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న దళితులు

దళితుల భూముల పరిశీలన

నెక్కొండ, జూలై 5: మండలకేంద్రం శివారులోని 215 సర్వే నంబర్‌లో 50 ఏళ్ల క్రితం ప్రభుత్వం దళితులకు పంపిణీ చేసిన భూముల్లో రియల్టర్లు అక్రమ నిర్మాణాలు చేపట్టారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, డీఎల్‌పీవో వేదవతి శుక్రవారం భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు ఈదునూరి వెంకన్న, కందిక సతీశ్, ఆకులపెల్లి చిన్న సురేశ్ డీఎల్‌పీవోతోపాటు కార్యదర్శి సదానందానికి వినతిపత్రాలు అందించారు.

కోటలో జీసీబీ డ్రైవర్ హల్‌చల్

పగిలిపోయిన రాతికోట ద్వార తోరణం

ఖిలావరంగల్, జూలై 5: ఓరుగల్లు కోటలో ఓ డ్రైవర్ జేసీబీతో శుక్రవారం సాయంత్రం హల్‌చల్ చేశాడు. వేగంగా జేసీబీని నడపడంతో అదుపు తప్పి రాతికోట పశ్చిమ ద్వారాన్ని ఢీకొట్టింది. దీంతో ద్వార తోరణం పగిలిపోయింది. అంతేకాకుండా జేసీబీని వేగంగా పరుగులు పెట్టించడంతో ఆటో, ద్విచక్ర వాహనదారులు, బాటసారులు భయాందోళనకు గురైనట్లు స్థానికులు తెలిపారు. కేంద్ర పురావస్తు శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

సమయపాలన పాటించకుంటే చర్యలు

- వన మహోత్సవంలో భాగస్వాములు కావాలి
- ఉత్తమ ఫలితాల సాధనకు టీచర్లు కృషి చేయాలి
- డీఈవో వాసంతి

కొత్తూరులో ఉపాధ్యాయులతో కలిసి మొక్క నాటుతున్న డీఈవో వాసంతి

రాయపర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో డీ వాసంతి హెచ్చరించారు. కొత్తూరులోని జడ్పీహెచ్‌ఎస్, ఎంపీఎస్‌ను శుక్రవారం ఆమె సందర్శించారు. పాఠశాలల్లోని తరగతి గదులు, క్రీడా మైదానాలు, రికార్డులు, హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యసన స్థాయికి అనుగుణంగా విద్యాబోధన చేయాలని డీఈవో సూచించారు. టీచర్లు, పిల్లల తల్లిదండ్రులు వనమహోత్సవంలో విధిగా భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా తరగతి గదిలో విద్యార్థులతో కలిసి కూర్చొని ఉపాధ్యాయుల బోధనా తీరును ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో నోముల రంగయ్య, టీచర్లు అనురాధ, కార్యదర్శి ఆస్మ, సీనపల్లి రాజు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

పని వేళల మార్పుపై టీచర్ల నిరసన

రాయపర్తి, జూలై 5: గురుకులాల పనివేళలను కుదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం రాయపర్తిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలల సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ గురుకులాలు ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా, నూతన ఉత్తర్వుల మేరకు 8 గంటలకే రావాల్సి వస్తున్నదన్నారు. ప్రభుత్వం ఒంటెద్దు పోకడలు, ఉద్యోగుల వ్యతిరేక నిర్ణయాలను ఇప్పటికైనా మానుకోవాలని పేర్కొన్నారు. గురుకులాల పనివేళలను సవరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీ